కరువు కోరల్లో మంచాల

- ఎండిపోతున్న వరిచేలు
- అడుగంటిన భూగర్భజలాలు
- పంట నష్టం వివరాలు సేకరించని అధికారులు
- ఆందోళనలో రైతన్నలు



తిప్పాయిగూడలో ఎండిపోయిన వరి చేను

మంచాల: గ్రామాల్లో కరువు విలయ తాడవం చేస్తోంది. సాగు నీరే కాదు.. తాగునీరు కూడా సరిపడా దొరకడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ క్రమంలో అధికారులు.. కరువుతో ఎండిన పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించడంలో కూడా అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా మొత్తంలో మంచాల మండలంలో కరువు తీవ్రత అధికంగా కనిపిస్తుంది. ఇక్కడ వేసవి ఎండలు మొదలుగాక ముందే ఫిబ్రవరిలోనే భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. ఈ సమస్య మార్చి నెలలో మరింత తీవ్రంగా మారింది. ఇంకా రెండు నెలలు ఎండలు ఉండనున్నాయి. ఇప్పటికే గర్భజలాలు కూడా తగ్గిపోయాయి. నీరందక ఇప్పటికే వరిపంట చేలు ఎండిపోవడంతో పాటు ఆరుతడి పంటలకు కూడా సాగునీరు కష్టంగా మారడంతో వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్న రైతన్న పరిస్థితి దీనంగా మారింది.

తగ్గిన సాగు..

మండలంలో సాధరణంగా 7,500 ఎకరాలకు పైగా యాసంగి వరి సాగు చేస్తారు. నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ఈసారి మాత్రం 4,100 ఎకరాలు మాత్రమే వరి సాగు చేశారు. అయితే చేసిన సాగులోనూ 50 శాతం వరకు పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రభుత్వం రైతాంగ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ఎండిన పంటల వివరాలు సేకరించి పరిహారం అందించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళనలో పాడిరైతులు

మండలంలో 75 శాతం రైతాంగం వ్యవసాయంతో పాటు పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామాల్లో భూగర్భజలాలు తగ్గిపోయి బోరు బావుల్లో ఒక్కసారిగా నీరు తగ్గిపోయింది. దీంతో పశుగ్రాసానికి సైతం నీరందని పరిస్థితి. రానున్న రెండు నెలలు కూడా ఈవిధంగానే ఎండలు ఉంటే పాడిపశువులకు కూడా తాగునీటి కొరత తప్పదనే భయం పాడిరైతుల్లో మొదలైంది.

పంట ఎండిపోయింది



13 ఎకరాల్లో వరిపంట సాగు చేశాను. నీటి లభ్యత లేకపోవడం, ఎండల తీవ్రతతో పంట పూర్తిగా ఎండిపోయింది. రూ.లక్షల్లో నష్టం జరిగింది. పశుగ్రాసానికి కూడా నీరుదొరకని పరిస్థితి ఉంది. ప్రభుత్వం పంట నష్ట వివరాలు తీసుకొని పరిహారం అందించాలి.

– జంగయ్య, రైతు, తిప్పాయిగూడ

కరువు ప్రాంతంగా ప్రకటించాలి



మంచాల మండలాలన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలి. వెంటనే పంట నష్ట వివరాలు సేకరించాలి. 25ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం మంచాలను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవడమే గాకుండా పాడిపశువులకు పశుగ్రాసం కూడా సరఫరా చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతాంగాన్ని ఆదుకోవాలి.

– సికిందర్‌రెడ్డి, పీఏసీయస్ మాజీ చైర్మన్, మంచాల

ఎలాంటి ఆదేశాలు లేవు



ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి కరువుపై మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రాథమికంగా ఏఏ గ్రామాల్లో కరువు కారణంగా పంటలు ఎండిపోయాయో వివరాలను తీసుకున్నాం. తిప్పాయిగూడ, బోడకొండ, చీదేడ్, దాద్‌పల్లి, రంగాపూర్, జాపాల, లోయపల్లి తదితర గ్రామాల్లో వరిపంట చేలు ఎండిపోయాయి.

– జ్యోతిశ్రీ, వ్యవసాయాధికారి, మంచాల

జనజాతరకు తరలిరండి

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: తుక్కుగూడలో శనివారం నిర్వహించే కాంగ్రెస్ జనజాతర బహిరంగసభను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. జనజాతర సభతో కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో నాయకులు, కార్యకర్తలు పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలలో విజయ ఢంకా మోగించాలని కోరారు. తుక్కుగూడలో జరిగే జనజాతర సభలో ఏఐసీసీ మేనిఫెస్టోను ప్రకటించనున్నట్లు ఆయన వెల్లడించారు. సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగు కాకతప్పదని ఆయన అన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి..

తలకొండపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శనివారం తుక్కుగూడలో జనజాతర శంఖారావ సభను నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ... తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలోనే గత తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఆరు గ్యారెంటీలను ప్రకటించుకొని రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగురవేశామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జాతీయ స్థాయి గ్యారెంటీలను కూడా తుక్కుగూడ సభలోనే కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం, అగ్రనాయకులు ప్రకటించనున్నారని తెలిపారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు తరలి రానున్నారని తెలిపారు. ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల్, కడ్తాల్ మండలాలతో పాటు, కల్వకుర్తి, అచ్చంపేట్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

ఓటుహక్కుపై అవగాహన అవసరం



ఓటరు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో కమిషనర్

మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి

తుర్కయంజాల్: ప్రతీ ఓటర్ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధి కొహెడలోని నారాయణ ఐఏఎస్ అకాడమీ అండ్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రత్యేక ఓటరు నమోదు, ఎన్నికల భాగస్వామ్యం అవేర్‌నెస్ క్యాంపెయిన్‌ను నిర్వహించారు. నూతనంగా ఓటరుగా నమోదు చేసుకున్న యువత తమ ఓటుహక్కును తప్పక వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని.. ఓటు విలువ తెలుసుకొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. గ్రామాల్లో అధికారులు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, మున్సిపల్ ఈఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. చైతన్య

- అండర్–14 క్రికెట్ పోటీలకు ఎంపిక
- ఆర్థికసాయం అందజేసిన శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న ఓ విద్యార్థిని శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన నిరుపేద అంజయ్య, చంద్రకళ దంపతుల కుమారుడు చైతన్య తుర్కంజాల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి చదవుతున్నాడు. ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో చైతన్య పాల్గొని అండర్–14 విభాగంలో బౌలర్‌గా ఎంపికయ్యాడు. ఈ క్రమంలో తదుపరి కర్ణాటక రాష్ట్రంలో ఆడేందుకు చైతన్యకు ఆర్థికసాయం చేయాల్సిందిగా పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి ఈ విషయాన్ని శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి తెలియజేశారు. తక్షణమే స్పందించిన ఆయన గురువారం హైదరాబాద్‌లో చైతన్యకు రూ.40వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, నాయకులు.. తిరుపతయ్య, బాల్‌రెడ్డి, అంజయ్య, జలంధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువమోర్చా లీగల్ సెల్ కన్వీనర్‌గా శ్రీశైలం



యాచారం: మండల పరిధిలోని తక్కళ్లపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం రాష్ట్ర బీజేపీ యువమోర్చా లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. యువమోర్చా యువతకు న్యాయపరంగా సహాయం చేయడం కోసం కృషిచేస్తానని అన్నారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

ఎంపీటీసీ జ్యోతి దాతృత్వం



పట్టుచీర, సరుకులు అందజేస్తున్న జ్యోతి తదితరులు

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లికి చెందిన రవీందర్ కూతురు శిరీష వివాహం నిశ్చయమైన సందర్భంగా గురువారం ఆ గ్రామ ఎంపీటీసీ కొర్ర జ్యోతినాయక్ క్వింటాల్ బియ్యం, పట్టుచీరను అందజేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌నాయక్, నాయకులు యాదయ్య, రామాచారి, రమేష్, బుచ్చయ్య, అఖిల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి: ఏఓ రాజు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: యాసంగిలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని ఏఓ రాజు ఎరువుల దుకాణపు యజమానులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌నిల్వ తదితర రికార్డులను పరిశీలించారు. యూరియా, డీఏపీ, ఎంఒపీల కొరత లేకుండా అవసరం మేరకు రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువు బస్తాలు అందజేయాలని అన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



తుర్కయంజాల్: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి, నాయకులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారంతో ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, బలిహరణ కుంభ నివేదన నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, త్రిదండి అస్త్రాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి, కౌన్సిలర్లు మంగమ్మ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం అందజేశారు.

వేంకేశ్వరస్వామి కల్యాణం..

ఇబ్రహీంపట్నం రూరల్: వేంకటేశ్వర స్వామి కల్యాణం గురువారం ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్‌లో కన్నుల పండగగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన ఈ వేడుకలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండేలా దీవించాలని స్వామివారిని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 17, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 28, క్యాబేజీ 18, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 23, దొండ 18–23, చిక్కుడు 35–50, గోకర 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 33, దోస 18, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35.శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- బీజేపీ సీనియర్ నేతలు ప్రతాప్, లచ్చిరెడ్డి
- మంచాలలో కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

మంచాల: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొనిపోవాలన్నారు. వచ్చే ఐదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. యువతను, మహిళలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మంచాల మండల కార్యాలయంలో నిర్వహించే రైతు సత్యాగ్రహ నిరసన దీక్ష, బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భాషయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు జంగయ్యగౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భిక్షపతి, లక్ష్మారెడ్డి, ఐలయ్య, రవీందర్‌రెడ్డి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: మండలంలోని మేడిగడ్డతండాలో గిరిజన యువతి వివాహానికి తండాకు చెందిన రాత్లావత్ రమేశ్ ఆర్థికసాయం అందించారు. మేడిగడ్డతండాకు చెందిన నేనావత్ రాములు కూతురు వివాహం సందర్భంగా గురువారం రాత్లావత్ రమేశ్ రూ.10 వేల నగదు అందించారు. తండాలోని ప్రతి పేదింటి ఆడపడచుల వివాహానికి ఆర్థికసాయాన్ని అందిస్తామని రమేశ్ తెలిపారు. స్థానిక నాయకులు నందురాథోడ్, సురేశ్, చంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లింపులో రాయితీ

బడంగ్‌పేట్: బడంగ్‌పేట నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరోఅవకాశంఇచ్చిరాయితీ కల్పించనుంది. 2024–25 సంవత్సరానికి గాను ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ ప్రకటించింది. ఈ అవకాశాన్ని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించగలరని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి రఘు పేర్కొన్నారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఆమనగల్లులో వనమహోత్సవం



వ్యవసాయ పొలంలో విందు ఆరగిస్తున్న ఓ కుటుంబం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ శివారులో గురువారం ప్రజలు వన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది ఉగాది పండుగ ముందు వనమహోత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. అదేవిధంగా ఈ ఏడాది కూడా స్థానికులు.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సమీప పొలాల వద్దకు తరలివెళ్లి అక్కడే చెట్లకింద వంటలు వండుకుని ముందుగా గ్రామదేవతకు నైవేద్యం సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనం చేశారు.

మాడ్గుల మండలంలో..

మాడ్గుల: మండల పరిధిలోని పలు గ్రామల్లో గురువారం ప్రజలు వనమహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మాడ్గుల, అవురుపల్లి, నల్లవారిపల్లి, దొడ్ల పహాడ్, నాగిల్ల, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో కుటుంబ సభ్యులతో పాటు అందరూ కలిసి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద చెట్ల కింద వంటచేసుకుని ఆరగించారు. గ్రామదేవతకు మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలు ఆటపాటలతో సందడి చేశారు.



సరూర్‌నగర్‌లో ముంజ కొడుతున్న దృశ్యం



ముంజ కొంటున్న వినియోగదారుడు

శారదానగర్ అభివృద్ధికి చర్యలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: శారదానగర్ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల కోరిక మేరకు ఆయన గురువారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీలో పర్యటించారు.నిర్మాణంలో ఉన్న కాలనీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తును ఆయన పరిశీలించారు. సీనియర్ సిటిజన్స్ కోసం కింది అంతస్తులో వసతులు కల్పించాలని, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, పార్క్ ప్రహరీ ఎత్తును పెంచాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఎన్నికల అనంతరం పనులు చేపడతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. నాయకులు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, కాలనీవాసులు నర్సింహారావు, సుబ్బారెడ్డి, సుధాకర్, ఇందిర, అరుణ, శ్రీనివాసరావు, రాఖీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

- కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకుందాం
- భర్త కోసం సంగీతరెడ్డి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో కొండా సంగీతరెడ్డి

బడంగ్‌పేట్: మహిళా సాధికారత కోసం దేశ ప్రధాని నరేంద్రమోడీ అహర్నిషలు కృషి చేస్తున్నారని కమలం గుర్తుకు ఓటేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కొండా సంగీత ఓటర్లను అభ్యర్థించారు. గురువారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంగీత రెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోడీ పాలన మహిళలకు అండగా ఉందని, అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. మహిళల సాధికారతకు ముద్రా రుణాలు, పీఎం విశ్వకర్మ వంటివి తీసుకొచ్చారన్నారు. రంగారెడ్డి జిల్లా, చేవేళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌లో తన భర్త మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ నుంచి పోటీలో ఉన్నారన్నారు. మీ అమూల్యమైన ఓటును కమలం గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేశ్, సరోజ, కావ్య, మహాలక్ష్మీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

భలే.. ముంజ!



తాటి ముంజలు

వేసవిలో ఎంతో మేలు

- శరీర సమతుల్యతను కాపాడుతాయి
- వడదెబ్బనుంచి రక్షణ
- విరివిగా విటమిన్ బీ, కే లభ్యం

హుడాకాంప్లెక్స్: ఆరోగ్యమే మహాభాగ్యం. కాబట్టి ప్రతిఒక్కరూ తీసుకునే ఆహారపు అలవాట్లు కూడా సహకరిస్తాయి. వాటిలో ముఖ్యమైనవి ప్రకృతి ప్రసాదించిన వాటిల్లో తాటి ముంజలు ప్రత్యేకమైనవి. వీటిని పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఇష్టపడతారు. కాబట్టి మార్కెట్‌లో కల్తీలేనివి, స్వచ్ఛమైనవి లభిస్తున్నాయి. ముఖ్యంగా ఇవి వేసవి కాలంలోనే లభిస్తాయి. వీటిని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చు. వేసవి సెలవులకు పల్లెటూర్లకు వెళ్లే వారు తాటి ముంజలు ఖచ్చితంగా తింటారు. అవి పల్లెల్లో ఎక్కువగా లభిస్తాయి. అక్కడి వారికి ముంజలంటే తెలియని వారుండరు. వాటిని ప్రతి ఒక్కరూ ఇష్టపడుతారు. ఇప్పుడు పట్టణాల్లో కూడా లభిస్తున్నాయి. శివారుప్రాంతాలనుంచి తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నారు. తాటి ముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజలవణాలను సమతుల్యం చేస్తాయి.

తాటి ముంజలతో ప్రయోజనాలు..

- విటమిన్ బీ 7, కే, సొలెబుల్ ఫైబర్, పొటాషియం, క్యాల్షియం, విటమిన్–ఏ, డీ, జింక్, ఐరన్ ఎక్కువగా లభిస్తాయి.
- వీటిలో నీటిశాతం ఎక్కువ ఉండటం వల్ల వడదెబ్బ తగలకుండా చేస్తాయి.
- శరీర ఉష్ణోగ్రత తగ్గించి చల్లబరుస్తాయి. అంతేకాకుండా డీ హైడ్రేషన్ బారిన పడకుండా చేస్తాయి.
- పొటాషియం సమృద్ధిగా ఉండడంతో రక్తపోటు అదుపులో ఉండి, గుండె సంబంధిత వ్యాధులను దరిచేరనియ్యవు. ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయి. ఇవి శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి.
- ముంజలను ప్రతీరోజు క్రమం తప్పకుండా తినడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గుతాయి.
- వీటిలో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యను తగ్గిస్తాయి. తిన్న ఆహారం సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటి, కడుపు ఉబ్బడం, ఉదర సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి.
- ఎండలో, వేడిమితాపానికి వచ్చే వికారం, వాంతులను నివారిస్తుంది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది. చికెన్ ఫాక్స్‌ను నివారించి శరీరంలోని అధిక బరువును తగ్గిస్తాయి.
- ముంజల్ని గుజ్జుగా చేసి ముఖానికి పైపూత రాసుకుంటే చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది. చర్మానికి కావాల్సినంత తేమను అందించి వేసవిలో వచ్చే చెమటకాయల్ని నివారిస్తుంది.

ఆరోగ్యానికి ఎంతో మేలు



ముంజలను పొట్టుతో తీసుకుంటే మలబద్దకం తగ్గుతుంది. జీర్ణకోశ సమస్యలకు దివ్య ఔషధంగా పని చేస్తాయి. పొటాషియం ఎక్కువగా లభిస్తుంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ తినొచ్చు. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

– డాక్టర్ ప్రభాకరాచారి, విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు